ప్రజాశక్తి

మంగళవారం 31 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



విశాఖలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు



అనకాపల్లిలో ఆందోళన చేపట్టిన నాయకులు

అంబేద్కర్‌ను అవమానించిన

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

వామపక్షాల ఆధ్వర్యాన నిరసనల హోరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ వేదికగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వామపక్షాల ఆధ్వర్యాన సోమవారం నిరసనలు హోరెత్తాయి. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపికి రాజ్యాంగంపై గౌరవం లేదని మండిపడ్డారు. (వార్తలు 5లో..)



పనులను పర్యవేక్షిస్తున్న తహశీల్దార్, సిఐలు

పోలీసు పహారా నడుమ

కారిడార్ పనులు

- సిపిఎం నాయకులు అప్పలరాజు హౌస్ అరెస్ట్
- పలుచోట్ల నిరసనలు

వార్తలు మెయిన్, టాబ్లాయిడ్‌లో..

రైతు ఆత్మహత్యాయత్నం

- అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఘటన
- తన సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన



చికిత్స పొందుతున్న రైతు రమణ

ప్రజాశక్తి – అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ అధికారుల వద్దకు ఏడాదిగా తిరుగుతున్నా తన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుని బంధువుల కథనం మేరకు.. మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన రైతు అనిమిరెడ్డి రమణ తన ఇంటితో పాటు భూ రికార్డులు, ఇతర కాగితాలు కాలిపోవడంతో రేకుల షెడ్ వేసుకొని ఆ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆ షెడ్‌కు కరెంట్ మీటరు ఇవ్వాలని, భూ రికార్డులు, రేషన్ కార్డు, ఇతర కాగితాలు ఇవ్వాలని సంవత్సర కాలం నుంచి జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. తన సమస్యను ఎవ్వరూ పరిష్కరించకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే ఆయన్ని బంధువులు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

సిపిఎం నాయకుల పరామర్శ

రైతు ఆత్మహత్యాయత్నం విషయం తెలియడంతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మిగతా 2లో..

పటిష్ట చర్యలతో నేరాలు తగ్గుముఖం

సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది చేపట్టిన పటిష్ట చర్యలతో నేరాల సంఖ్య తగ్గిందని సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 2024 పోలీసు వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. నేర నియంత్రణలో భాగంగా నగర వ్యాప్తంగా 7526 సీసీ కెమెరాలు అమర్చామని, సమస్యాత్మక ప్రాంతాల్లో 1442 లైట్లు ఏర్పాటు చేశామని, 126 నైట్ బీట్ టీంలను రంగంలోకి దించామని తెలిపారు. 272 మందిపై రౌడీ షీట్‌లు తెరిచామన్నారు. 5192 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ట్రాఫిక్ విభాగంలో ఎన్నడూ లేని విధంగా 8,72,808 కేసులను నమోదు చేశామని, 4,25,822 కేసులలో చలానాలు విధించామని, 97,090 వాహనాలను సీజ్ చేశామని వెల్లడించారు. ఈ ఏడాది 1094 రోడ్డు ప్రమాదాలను జరిగాయని తెలిపారు. 116 ఎస్సీ, ఎస్టీ కేసులు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రైతు ఆత్మహత్యాయత్నం

కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స పొందుతున్న రైతు రమణను పరామర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు సకాలంలో స్పందించకపోవడంతో రమణ ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆయనకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాధిత రైతుకు ఏదైనా జరిగితే దానికి జిల్లా అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

దేవరాపల్లి : రమణ ఆత్మహత్యాయత్నానికి అధికారుల తీరే కారణమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న తెలిపారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిపి

పటిష్ట చర్యలతో నేరాలు తగ్గుముఖం

నమోదయ్యాయని, 313 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు కాగా 718 మందిని అరెస్టు చేశామన్నారు. 364 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా 2523 బ్యాంకు అకౌంట్లను సీజ్ చేసినట్టు తెలిపారు. సైబర్ క్రైమ్ కేసుల నియంత్రణకు పలు ప్రాంతాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. రూ.4,63 కోట్లను తిరిగి బాధితులు అందించామని అన్నారు. 30 మిస్సింగ్ కేసులను 24 గంటల్లోగా ఛేదించామన్నారు. మీడియా సమావేశంలో పలువురు డిసిపిలు, ఎసిపిలు పాల్గొన్నారు.

టారిఫ్, సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను అంగీకరించవద్దు

- వార్వా, నివాస్ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : 2025- 26కి సంబంధించి డిస్కంలు ప్రతిపాదించిన టారిఫ్, సర్దుబాట్ల ఛార్జీల ప్రతిపాదనలకు అంగీకరించరాదని డిమాండ్ చేస్తూ వార్వా, నివాస్ సంస్థల కార్యదర్శులు బిబి.గణేష్, పిట్టా నారాయణమూర్తి ఎపిఇఆర్‌సికి అభ్యంతరాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం మీడియాతో మాట్లాడుతతూ ఇప్పటికే 2014 -19 వరకు 2022- 23, 2023 - 24 సంవత్సరాలకు సంబంధించిన సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. 2025 - 26కు సంబంధించి రూ.5538.6 కోట్ల మొత్తాన్ని ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల రూపంలో వసూలు చేయాలని డిస్కంలు ప్రతిపాదించాయన్నారు. ఈ ఇంధన సర్దుబాటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, వినియోగదారులపై వెయ్యరాదని కోరారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

జీతాలు చెల్లించకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే న్యాయం చేయాలంటూ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఉక్కు ఉద్యోగులు అర్ధాకలితో బతుకుతున్నారని తెలిపారు. సుమారు 150 మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంతకాలు చేసిన గ్రీవెన్స్ ఫిర్యాదును సమర్పించారు. వెంటనే ఈ విషయం మీద జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కెవి.రత్నం, దాసరి పుల్లారావు, రమణ, వెంకట్ రాజు, పరమానంద, బి.సాయి, ఫణీంద్ర బాబు, ఆంజనేయ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల దడ

భద్రత డొల్లతనం
రక్షణ చర్యలు నామమాత్రం
రాని కొత్త పరిశ్రమలు
స్థానికులకు ఉపాధి లేమి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఔషధ, రసాయన పరిశ్రమల్లో భద్రత, రక్షణ చర్యల్లేమితో ప్రమాదాలు ఈ ఏడాది పాటు కొనసాగాయి. కార్మికులు, ఉద్యోగుల్లో భయానక వాతావరణం నెలకొంది. పరిశ్రమాధిపతులు ప్రమాదాల నియంత్రణకు కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. పరిశ్రమ ప్రమాణాలు పాటించలేదు. ప్రభుత్వమూ భద్రతపై శ్రద్ధ చూపలేదు. కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వలేదు. తమ లోపాలతో జరిగిన ప్రమాదాలకు బాధ్యులైన పరిశ్రమాధిపతులపై కఠిన చర్యలు తీసుకోలేదు. వారిపై అత్యంత ఉదారంగా వ్యవహరించింది. ప్రభుత్వమే యజమానులను వెనుకేసుకురావడంతో ప్రభుత్వ యంత్రాంగం అచేతనంగా తయారైంది. అసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది కార్మికులు చనిపోయి, 38 మంది గాయపడ్డారు. అయినా యాజమాన్య ప్రతినిధులపై సరైన చర్యలు లేవు. ఈ ఘటన తరువాత సినర్జిన్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ నలుగురు కార్మికులు మృతి చెందారు. ఠాగూర్‌లో ఇద్దరు చనిపోయారు. విజయశ్రీ, రక్షిత్ ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కార్మికుల ఆస్పత్రులపాలయ్యారు.

జిల్లాలో పరిశ్రమలు భయాన్ని సృష్టించాయి తప్ప ఆత్మస్థైర్యాన్ని కల్పించలేకపోయాయి. నిర్వాసితులు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న జిఓ అమలుకునోచుకోలేదు. ఈ ఏడాది చెప్పుకోదగిన కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు రాలేదు. కాకినాడ ప్రాంతంలో ప్రజలు పోరాడి ప్రతిఘటించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలోని 2001 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇప్పటికే రసాయన పరిశ్రమలతో నిండిన తీరంలో మరిన్ని రసాయన పరిశ్రమలు ఏర్పాటుకానుండడంతో మత్స్యకారుల తమ జీవనోపాధిపై తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. సముద్రంలో చేపల వేటకు దూరమవుతామని ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజల బాధలు, సమస్యలు ఆనాడు వైసిపి, ఈనాడు కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన, బిజెపికి పట్టడంలేదు. పర్యావరణ ప్రమాదంలేని వ్యవసాయాధారిత పరిశ్రమలు కంటే రసాయన పరిశ్రమలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రభుత్వరంగ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే క్రమంలో నక్కపల్లి ప్రాంతంలో ప్రయివేటు మిట్టల్ స్టీల్ ఏర్పాటవుతుందని నమ్మబలుకుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని అడగని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమ ఏర్పాటుకాని మిట్టల్‌కు గనులు కేటాయించాలని ప్రధాని మోడీని కోరి ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయడానికి సిద్ధపడ్డారు. వేలాది ఉద్యోగాలు వస్తాయని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని భారీ, మధ్య తరహా ప్రయివేటు పరిశ్రమల్లో నిర్వాసిత కుటుంబాలు, విద్యార్హత కల్గిన స్థానిక యువతకు ఉపాధి ఎలా ఎండమావిలా వుందో, మిట్టల్ స్టీల్‌లో కూడా అలాగే వుండబోతుంది. ప్రభుత్వ రంగ పరిశ్రమ వలె మిట్టల్‌లో స్థానిక యువతకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత వుండదు. రిజర్వేషన్లు అమలుకావు. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను గొంతుకేసి, ప్రయివేటు మిట్టల్ స్టీల్‌కు ఊపిరిపోయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వంపై ఒత్తిడి తేలేని స్థానిక ఎమ్మెల్యేలు చివరకు తూలూపి నష్టం తెచ్చిపెడుతున్నారు.

పరిశ్రమల్లో తక్కువ జీతాలకు పనిచేసే వలస కార్మికులతో పనిచేయించుకుంటున్న అనుభవాలున్నాయి. భవిష్యత్‌లో ఈ పరిస్థితి కొనసాగేలా ప్రభుత్వ విధానాలున్నాయి తప్ప స్థానికులకు ఉపాధి కల్పించేలా లేవు. ఈ ఏడాది కోడూరులో కొత్తగా 250 సూక్ష, చిన్న,మధ్య తరహా యూనిట్లు నెలకొల్పడానికి ఎపిఐఐసి ప్రయత్నం ప్రారంభించింది. అచ్యుతాపురంలో ఎన్‌టిపిసి ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుపై ప్రచారమే తప్ప కార్యరూపందాల్చలేదు.


అసెన్షియా ప్రమాదంలో గాయపడ్డ కార్మికులు (ఫైల్ ఫోటో)


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత ఉద్యోగులు

నియామకాల్లో ఉల్లంఘనలు

విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖపై ఆరోపణల వెల్లువ
సమస్యపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పథకమైనా.. ప్రాజెక్టయినా.. ఉద్యోగాల బదిలీ అయినా.. కొత్త పోస్టులు తీసినా.. ఒక టేబుల్ మీద నుంచి వేరొక టేబుల్‌పైకి ఫైలు కదిలినా.. విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కొంతమంది అధికారులపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తాజాగా కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది రోడ్డెక్కడంతో వైద్య రంగంలో పోస్టుల భర్తీ వెనుక కొందరి పాత్ర చర్చనీయాంశంగా మారింది. హెల్త్ అసిస్టెంట్ల ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలో 2002-2003 నుంచి చేస్తున్న పలువురు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు రూల్ ఆఫ్ రెగ్యులరైజేషన్ (ఆర్ఒఆర్)ను వైద్య శాఖ ఉల్లంఘించిందంటూ నేరుగా బాధితులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో కలిసి తమ గోడు వెల్లడీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ జీవోను అమలు చేసి విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మాత్రం ఉల్లంఘించిందని వైద్య ఆరోగ్య అసిస్టెంట్‌లు వై.సురేష్, పి.జ్ఞాన కిశోర్, ఆర్.అప్పలాచారి తెలిపారు. 2024లో రెగ్యులర్ అవ్వాల్సిన 54 మంది పూర్తిగా టెర్మినేట్ అవ్వడంతో వారంతా లబోదిబోమంటున్నారు.

శీతాకాలంలో ఆహార జాగ్రత్తలు పాటించాలి


డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్

డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్

ప్రజాశక్తి-ఆరిలోవ : శీతాకాలంలో ఆహారం విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సీనియర్ కన్సల్టెంట్ ఎ.ి జి షి య ం స్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్ సూచించారు. శీతాకాలంలో ఎక్కడ నొప్పి పుట్టినా, దెబ్బ తగిలినా తొందరగా తగ్గకపోవడానికి కారణం చలిలో బ్యాక్టీరియా పెరుగుదల ఎక్కువగా ఉండడమేనని తెలిపారు. తినే ఆహారం వల్ల శరీరం మార్పులకు గురవుతూ ఉంటుందని, మధుమేహం ఉన్న వారికి ఈ కాలం ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. ఒంటి నొప్పులు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. శీతాకాలంలో చింతపండుతో చేసిన పుల్లని పదార్థాలు ఎక్కువగా తినకపోవడం మంచిదని పేర్కొన్నారు. చలికి భయపడి ఏ పని చేయకుండా ఎక్కువగా ఇంట్లోనే ఉండిపోకూడదని, కొద్దిసేపైనా తాజా గాలి ఇంట్లోకి వచ్చేలా చూసుకోవాలని వివరించారు. ఉదయాన్నే కాసేపు వ్యాయామం చేయాలని, మోకాలు, నడుం నొప్పులు ఎక్కువగా ఉన్నవారు ఎక్కువ సమయం చేయకూడదని తెలిపారు. ఇంట్లో ఎక్కువగా ఉండే వారు కొంతసేపు ఎండలో నడవడం మంచిదని పేర్కొన్నారు. శీతాకాలంలో కూల్ డ్రిక్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో పనిచేసేవారు చేతులకు గ్లౌజులు, వెచ్చదనం ఇచ్చే దుస్తులు వాడడం మంచిదని వివరించారు. ఎక్కువ చలి ఉంటే రక్త ప్రసరణ మీద ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. రక్త ప్రసరణ సరిగ్గా జరగాలంటే వాకింగ్, జాగింగ్ తదితర వ్యాయామం చేయడం మంచిదని పేర్కొన్నారు. శీతాకాలంలో ఆలూ, గుమ్మడి, కందగడ్డ తదితర దుంప కూరలకు దూరంగా ఉండడం మంచిదని వివరించారు. సిట్రజ్ జాతికి చెందిన ఆరెంజ్ పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యకరమని తెలిపారు. నొప్పులుంటే కొద్దిగా కొబ్బరి నూనెను వేడిచేసి మర్దనా చేసుకొని గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే ఉపశమనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలంలో వెల్లుల్లి ఎక్కువగా తీసుకోవడం మంచిదని తెలిపారు. టీ, కాఫీలకు బదులు లెమన్, గ్రీన్ టీ తీసుకోవచ్చని పేర్కొన్నారు.

'ఉపాధి' తనిఖీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా సామాజిక గ్రామ తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం అధికారి ఎస్ఆర్‌పి.నాగరాజు ఆధ్వర్యాన పనులపై సమీక్ష చేపట్టారు. పనిలో నాణ్యత, పనికి నగదు లావాదేవీలు అందుతున్నాయా లేదా అనే అంశాలపై కూలీలతో మాట్లాడారు. 2022-2024 సంవత్సరానికి గాను సోషల్ ఆడిట్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ షమ్ము, కోన శ్రీనివాసరావు, చందక అప్పలరాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు ఒక అర్జీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌కు ఒక అర్జీ అందింది. రెవెన్యూ విభాగానికి సంబంధించి అందిన అర్జీని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగం అధికారికి పంపించినట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధి ఆకుల వారి కల్లాలు కాలనీలో టిడిపి సభ్యత్వ నమోదు నిర్వహించారు. తెలుగుదేశం భీమిలి నియోజవర్గం నాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బంటుపల్లి గోవిందరావు, మీసాల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఆలయంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం చేపట్టారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ, అన్న ప్రసాదాలు స్వీకరించారు.

ఎయులో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీలోని యుజిసి ఆకడమిక్ స్టాఫ్ కాలేజీ (ఎమ్ఎమ్‌టిటిసి) పరిసరాల్లో సోమవారం సంస్థ ఉద్యోగులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. గత కొంత కాలంగా పేరుకుపోయిన చెత్తను తీసి శుభ్రం చేశారు. గతంలో కురిసిన వర్షాలకు రేకుల షెడ్డుపై పడిన తుమ్మ చెట్టును తొలగించారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, సీతారామ్, ప్రసాద్, లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన ఫిట్ ఇండియా వీక్ పోటీలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో సాయి అకాడమీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యాన ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ఫిట్ ఇండియా వీక్ 2024 క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, స్థానిక ఎమ్మెల్యే గణబాబు హాజరై క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిపి శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడల్లో రాణించి నగరానికి పేరు తేవాలని సూచించారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి నరసింహమూర్తి, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, చీఫ్ కోచ్ సాయి, సత్యనారాయణ, నగర ఒలింపిక్



ముగింపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

అసోసియేషన్ ప్రతినిధి కె.సూర్యనారాయణ, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు ఐ.వెంకటేశ్వరరావు, మధుసూదన్, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాష్, వాలీ బాల్ కోచ్ మోహనబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక


జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 13 మంది విద్యార్థులు జూడో ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎ.బాలమణి సోమవారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపిక పూర్తి చేసుకొని రాష్ట్రస్థాయిలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు లావణ్య, కె.గణేష్, దుర్గ, జి.జాహ్నవి, టి.భాగ్యశ్రీ, ఆర్.అజయ్‌కుమార్, టి.కుమారస్వామి, టి.పృధ్వి, లోకేష్, అడ్డి భరత్‌కుమార్, పి.వీరభద్ర, సిహెచ్.లోకేష్, డి.కిరణ్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీడీ నారాయణమ్మ, పద్మనాభం ఎంపిటిసి కె.లక్ష్మీనాయుడు, నాయకులు టి.పద్మనాభం తదితరులు అభినందనలు తెలిపారు.

పరీక్ష పే చర్చపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయంలో సోమవారం పరీక్ష పే చర్చపై అవగాహన కల్పిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. పరీక్ష పే చర్చ జిల్లా నోడల్ అధికారులుగా ఎల్.సుధాకర్, జిజిఎస్.నాగేశ్వరరావు, మండల నోడల్ అధికారిగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు నియమితులయ్యారని ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు

రెడ్డిపల్లిలో రోడ్డు వేయాలి

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం - విజయనగరం రోడ్డులో శేరిఖాండం- రెడ్డిపల్లి గ్రామాల రోడ్డు నిర్మాణం చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం రోడ్డుపై నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. సుమారు కిలోమీటర్ దూరం ఉన్న ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయని, పదేళ్లుగా ఈ రహదారిని పట్టించుకోవడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. మంగళవారం రెడ్డిపల్లి రామాలయం ఎదుట ధర్నా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో రాజకీయ నాయకులు ఉన్నప్పటికీ ఈ రోడ్డు పరిస్థితిని పట్టించుకోవడంలేదని, దీంతో పార్టీలకతీతంగా ధర్నా నిర్వహిస్తామని గ్రామానికి చెందిన వరలక్ష్మి తెలిపారు.



ప్రధానోపాధ్యాయునికి సన్మానం చేస్తున్న వెల్లంకి గ్రామస్తులు

ప్రధానోపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం: వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన వెంకటేశ్వరరావు విరమణ సందర్భంగా సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్, ఉప సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు కంచరాపు శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు సన్మానించారు. వెంకటేశ్వరరావు సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, పివివి.ప్రసాద్ పట్నాయక్, చెన్న రాజు, తాటిశెట్టి రమేష్, తాటిశెట్టి సూరిబాబు, గుడ్ల రామారావు, కొర్రాయి సాయి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి పిఎన్ఎం, రాయిపాలెం హైస్కూళ్లకు చెందిన టెన్త్ విద్యార్థులకు పలు అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ చీఫ్ అడ్వైజర్ జరాజపు సురేష్ కుమార్ మాట్లాడుతూ, పరీక్షల సందర్భంగా భయం వీడాలని, ఆరోగ్య పరంగా తేలిక పాటి ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. టెన్త్ ఉత్తీర్ణత అనంతరం ఏయే కోర్సుల్లో ప్రవేశం పొందితే ప్రయోజనం ఉంటుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇ.వెంకటరావు, జె.రాధాకుమారి, యువ భారత్ భీమిలి శాఖ కన్వీనర్ ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.


కొరపల్లిలో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సినీ యూనిట్ సభ్యులు

కొరపల్లిలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండురంగ పంచాయతీ పరిధి కొరపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఫ్యాన్ ఇండియా చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాకు నిర్మాతగా అదే గ్రామానికి చెందిన రాజా సాగి సత్యనారాయణరాజు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈయన నిర్మాతగా మూడు చిత్రాలను చిత్రీకరించారు. చిత్రానికి హీరోయిన్‌గా హారిక నటిస్తున్నారని, పల్లెటూరు కథ ఇతివృత్తంగా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు.

మత్స్యకార సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం వేదిక వద్ద మత్స్యకార సొసైటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షునిగా కారి చిన్నారావు, ఉపాధ్యక్షునిగా శీరం లక్ష్మణ, డైరెక్టర్లుగా ఉమ్మిడి చిన్న మసేను, శీరం పోలిరాజు, పి.బాలాజీ, జి.ఎల్లాజీ, కె.నానాజీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మత్స్యశాఖ నుంచి హాజరైన అధికారులు మురళి, సుమాంజలి, దేవి తెలిపారు. ఎగువ పేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వి.కొండబాబు తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

నెట్‌బాల్ ఎయు పురుషుల జట్టు ఎంపిక

పజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల నెట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను ఎయు దురవిద్యాకేంద్ర డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయ్ మోహన్ అభినందించారు. ఈ పోటీలు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ పురుషుల విభాగంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషష్ ఎవిఎస్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ, ఎయు వ్యాయామ విద్యా విభాగం అతిథి ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహనకు పాఠశాలల్లో గీతం ప్రాజెక్టు

ప్రజాశక్తి-మధురవాడ : శాస్త్ర విజ్ఞానం పట్ల పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలల్లో చేసి చూపించడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) సహకారంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స్" పేరిట ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తోంది. జిల్లా విద్యాశాఖతో కలిసి ఆనందపురం, నరవ, చంద్రంపాలెం, చింతల అగ్రహారంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో వారంరోజులుగా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ బి.స్పందన తెలిపారు. త్వరలో ఉన్నత పాఠశాలల అధ్యాపకులకు సైన్స్ వర్క్‌షాప్‌లను, పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌లు, విద్యార్థులకు నూతన ఆలోచనలపై పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో సహ ఇన్వెస్టిగేటర్లుగా ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన డాక్టర్ వివికె.లక్ష్మి, డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ కె.ఆదర్శకుమార్, డాక్టర్ పి.కనకరాజు వ్యవహరిస్తున్నారని వివరించారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా కార్యక్రమాల రూపకల్పన

ఈ ప్రాజెక్టులో భాగంగా పాఠశాల విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి ప్రాజెక్టు నిపుణులు సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఇళ్లలో ఉపయోగించే మిక్సర్, వాషింగ్ మిషన్, ఫ్యాన్, హీటర్, క్యాలికులేటర్ ఎలా పనిచేస్తాయో వాటి వెనక ఉపయోగించే శాస్త్ర విజ్ఞానం వివరిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నిత్య జీవితంలో రక్తం నమూనాలను పరిశీలించడం, వివిధ రకాల పరీక్షలు, వ్యాధి నిర్ధారణ వంటి అంశాలను తెలియజేస్తున్నారు. వీటితో పాటు సూర్య గ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం వంటి అంశాలతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లు ఎగిరే సాంకేతికత, రోబోలు పనిచేసే తీరు వంటివి విద్యార్థులకు ఆసక్తికరంగా వివరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో గీతం ఇంజినీరింగ్, సైన్స్ విభాగాల ప్రొఫెసర్లు, సైన్స్ ఎడ్యుకేటర్లు, పీజీ విద్యార్థులను భాగస్వాములను చేశారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

మాతా, శిశు మరణాలను నివారించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో మాతృ, శిశు మరణాలను నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సోమవారం మాతృ, శిశు మరణాలపై జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రానగర్, బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో చెరొక మాతృ మరణాలు సంభవించాయని తెలిపారు. పెదగంట్యాడ, శొంఠ్యాం, రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చెరొక శిశు మరణాలు సంభవించాయని చెప్పారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవించే వరకు, ప్రసవానంతర సేవలు సక్రమంగా అందేలా చూడాలని పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎఎన్ఎంలను ఆదేశించారు. శిశువులకు అన్ని వ్యాధి నిరోధక టీకాలూ సమయానికి అందజేయాలన్నారు. ఈ సమీక్షలో డాక్టర్లు ఉషాప్రసాద్, గిరిధర్, షర్మిలాకుమారి, శ్రావణ్, ప్రవీణ్, జి.రాజేష్, సంబంధిత ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వివి.రమణారావు అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో రాణించి పాఠశాల పేరు ప్రఖ్యాతులను జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. క్రీడలు, విద్య, ఇతర రంగాలలో రాణిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రశాంత వాతావరణంలో పాఠశాల, ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 87, 88 వార్డుల కార్పొరేటర్లు బొండా జగన్నాథరావు, మొల్లి ముత్యాలనాయుడు హాజరయ్యారు.

తారు రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 98వ వార్డులో పంచాయతీ కాలనీ నుంచి శ్రీకృష్ణుడు గుడి వరకు రూ.11 లక్షలతో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను కార్పొరేటర్ పివి.నరసింహ సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించి, వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ రోడ్డు నిర్మాణం పట్ల కాలనీ వాసులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

కబడ్డీలో 'విశాఖ' ప్రథమం

ప్రజాశక్తి-వేపగుంట : విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ జరిగిన స్పోర్ట్ మీట్‌లో తమ విద్యార్థులు కబడ్డీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారని నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఛైర్మన్ జి సత్యనారాయణ తెలిపారు. గుంటూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వీరు అర్హత సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో అన్ని క్రీడల్లో విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇవ్వాలని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కుశ రాజు, రూపకు సూచించారు. బంగారు పతకం సాధించిన విద్యార్థులను ఛైర్మన్‌తోపాటు ప్రిన్సిపల్ డివి.ప్రదీప్‌వర్మ, సిఎస్ఇ విభాగాధిపతి కె.తేజస్విని అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

నైపుణ్యం వెలికితీతకు టాలెంట్ షోలు దోహదం



యంగ్ టాలెంట్ షో ట్రోఫీని ఆవిష్కరిస్తున్న రమణమూర్తి తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : యువతలో నైపుణ్యాన్ని వెలికితీయడానికి యంగ్ టాలెంట్ షోలు దోహదపడతాయని రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి తెలిపారు. ధనుంజయ్ అండ్ టీం ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో జనవరి 1న జరగనున్న యంగ్ టాలెంట్ షో ట్రోఫీ లాంచ్ కార్యక్రమం సోమవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. యంగ్ టాలెంట్ షో ట్రోఫీని రమణమూర్తి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలోని మారుమూల కళాకారులకు జాతీయ స్థాయి గుర్తింపు తేవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. యువత ఈ మహత్తర అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వైజాగ్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపకులు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, పిల్లల మీద ఎక్కువ శ్రద్ధ తీసుకునే దేశానికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ట్రోఫీ నిర్వాహకులు ధనుంజయ్ మాట్లాడుతూ, 20 ఏళ్ల లోపు యువతలో ఉండే టాలెంట్‌ను వెలికి తీసేందుకే ఈ టాలెంట్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ ఆడిషన్స్ ద్వారా వందలాది మంది యువత నమోదయ్యారని చెప్పారు. వారిలో ప్రతిభ కలిగిన 40 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఈ యంగ్ టాలెంట్ షోలో డాన్స్, సింగింగ్, మార్షల్ ఆర్ట్స్, క్లాసికల్ డాన్స్, ఫోక్ డాన్స్, స్టాండప్ కామెడీ, ఫ్యాషన్ షో తదితరాలపై ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. టాలెంట్ షోలో పాల్గొన్న వారికే కాకుండా ప్రేక్షకులకు కూడా గిఫ్ట్ కూపన్లను అందజేస్తామన్నారు. జనవరి 1వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి టాలెంట్ షో ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, దాలి రాజు, యాదకుమార్, మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, ఎంఎస్ఆర్, ఫణిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 67వ వార్డు పరిధి పెంటయ్యనగర్‌లో రూ.9 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాక ముఖ చిత్రం మారిపోయేటట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. జిఒ 301 ప్రకారం అర్హులైన వారందరికీ పట్టాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నియోజవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు పల్లా రంగాయాదవ్, ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి సింహాచలం, బిజెపి, జనసేన నాయకులు గూడూరు శంకర్రావు, ఆడారి వెంకట్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర కేలండర్లు ఆవిష్కరణ



యుటిఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : యుటిఎఫ్ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు, రొంగలి ఉమాదేవి, కె.రాంబాబు, చక్కసత్యం, రియాజ్ అహ్మద్, జగన్, ఎ.విజయకుమారి, టి.రాజు, యు.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ కేలండర్ ఆవిష్కరణ

గాజువాక : జింక్ గేట్ వద్ద జింక్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో కెవిపిఎస్ క్యాలెండర్‌ను జింక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి వై.సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో జింక్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి దిమ్మల శివప్రసాద్, కోశాధికారి ఎం.అప్పారావు, పద్మనాభం, పెద్దిరాజు, రాకేష్ పాల్గొన్నారు.

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి ప్రచురించిన 2025 కేలండర్, డైరీని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు రానున్న రోజుల్లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ పోరాట సమితి ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం, ఉత్తరాంధ్ర న్యూస్ కిలారి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ తాడి నాగరాజు, మణికంఠ, జనసేన నాయకులు మర్రివేముల శ్రీనివాస్, భయనా సునీల్, నర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయు నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం 2025 సంవత్సరం నూతన సంవత్సర కేలండర్‌ను వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం ఆవిష్కరించారు. అకడమిక్ సెనేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కేలండర్‌తోపాటు గ్రీటింగ్ కార్డులు ఆవిష్కరించి అధికారులకు ఆయన బహుకరించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య శశిభూషణరావు మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎయులో ప్రత్యేకంగా సెంటినరీ టవర్, సెంటినరీ పార్కులను నిర్మిస్తామని తెలిపారు. 2026 జనవరి 26న సెంటినరీ వేడుకల ప్రధాన కార్యక్రమానికి దేశ ప్రధాని ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. 2025 ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమయ్యే శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని విభిన్న సదస్సులు, వర్క్ షాప్ లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది పొడవునా ఈ కార్యక్రమాలను జరుపుతామని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎంవిఆర్.రాజు, డి.నగరాజకుమారి, జి.గిరిజాశంకర్, ఆర్.పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎయు ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

- వామపక్షాల ఆధ్వర్యాన నిరసనల హోరు



అచ్యుతాపురంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కేంద్ర మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు అమిషా రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధర్యంలో నిరసన తెలిపారు. ముందుగా వామపక్ష పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్ షా గానీ, ప్రధాని నరేంద్ర మోడీ గానీ అందుకు బాధ్యత వహించడానికి కానీ, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కానీ సిద్ధపడకపోవడం దారుణమన్నారు. అమిత్ షా కు రాజ్యాంగం మీద గాని, అంబేద్కర్ మీద గాని గౌరవం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, కె.అప్పలరాజు, జి.సుభాషిణి, ఎం.రమణ, పి.చలపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దొరబాబు, ఎం.రామునాయుడు, ఆర్.అప్పలరాజు పాల్గొన్నారు.

పరవాడ : అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద సిపిఎం ఆధర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు వివి రమణ, జి అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : అమిత్‌షా బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరుతూ సిఐటియు నాయకులు యలమంచిలి మెయిన్‌రోడ్డు దిమిలి జంక్షన్‌లో సోమవారం నరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ, నాయకులు కూర్మారావు, జానకి, అప్పన్న, రాము, చిరంజీవి పాల్గొన్నారు.

అచ్చుతాపురం : అమిత్ షా క్షమాపణ చెప్పాలని కోరుతూ అచ్చుతాపురం జంక్షన్‌లో సోమవారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కూండ్రపు సోమునాయుడు, శేషు, తట్టా రాజు, పోలవరపు గోవిందు, ఒడిసెల శ్యాము, చల్ల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో మండలంలో కోరుప్రోలు గ్రామంలో నిరసన చేపట్టారు. .ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, కోన పెంటయ్య అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ, అమిత్ షాకు చిత్త శుద్ధి ఉంటే వెంటనే రాజీనామా చేసి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మనబాల రాజేష్, నాయకులు మామిడి నానాజీ, కోన ప్రకాష్, గొడుగు కొండయ్య పాల్గొన్నారు.

తగరపువలస : సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలస ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, భాగం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

అమిత్‌షా రాజీనామా చేయాల్సిందే..

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : అంబేద్కర్‌పై అమిత్‌షా అవమానకర వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం విశాఖలోని ఎల్ఐసి కార్యాలయ దరి అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు నిరసన తెలిపాయి. ఆందోళనకారుల చేతిలో ఉన్న అమిత్‌షా దిష్టిబొమ్మను పోలీసులు లాక్కునే క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. చిన్నపాటి తోపులాట జరిగింది. తుదకు ఆ దిష్టిబొమ్మను వామపక్ష కార్యకర్తలు ముక్కలు ముక్కలు చేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్‌ను ప్రేమిస్తుంటే భారతదేశంలోని మనువాదులు మాత్రం ఆయన్ని ద్వేషించుకుంటున్నారన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు చేపట్టిన బిజెపి మనువాదుల అసలు స్వరూపం బయటపడుతోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పాలకవర్గాలు దానికి తూట్లు పొడవటమే కాకుండా అంబేద్కర్‌ను కూడా అవమానిస్తే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు వై.కొండయ్య, ఎస్‌యుసిఐసి రాష్ట్ర నాయకులు గోవిందరాజులు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు దేవా, వామపక్ష నాయకులు వి.కృష్ణారావు, పి.చంద్రశేఖర్, ఎం.సుబ్బారావు, ఎం.వెంకటేశ్వర్లు, వై.రాజు, ఎం.లక్ష్మి, జిఎస్‌జె.అచ్యుతరావు, ఎ.విమల, పి.వెంకటరావు, కె.కుమారి పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్‌పి కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఇవిఎం గొడౌనును జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. గొడౌను త్రైమాసిక తనిఖీలలో భాగంగా గొడౌను సీళ్లను తీసి, నియోజకవర్గాల వారీగా భద్రపరచిన స్ట్రాంగు రూంలను పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గొడౌనుకు సీళ్లను వేసారు. ఈ కార్యకమంలో డిఆర్‌ఒ వైఎస్‌వికెజిఎస్‌ఎల్. సత్యనారాయణరావు, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ ఆయిషా, అనకాపల్లి అగ్నిమాపక అధికారి పి.నాగేశ్వరరావు, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్‌ఎస్‌వి.నాయుడు, టిడిపి నాయకులు బి.శ్రీనివాసరావు, ఆప్ ప్రతినిధి కె.హరినాధబాబు, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, వైసిపి ప్రతినిధి జి.రాజు, ఐఎన్‌సి ప్రతినిధులు వి. వెంకట సత్యనారాయణ, టి.రమణ పాల్గొన్నారు.

రెల్లి కులస్తుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం రెల్లి కులస్తుల సమస్యలు పరిష్కరించాలని రెల్లి కుల జాతీయ అధ్యక్షులు భూపతి అప్పారావు కోరారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాల గ్రామంలో సోమవారం కోన అప్పారావు, కోన దుర్గేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా నగర్ కాలనీ రెల్లి వీధిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల ఇందిరా నగర్ రెల్లి వీధి పెద్దలు బంగారు వెంకటేశ్వరరావు, కోన అప్పారావు (గాంధీ), కోన జయ చంద్రుడు, ముత్యాల నూకరాజు, భూపతి ఈశ్వర అప్పారావు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వం తీసుకున్న గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు బోని గణేష్ సోమవారం రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా సబ్బవరపు గణేష్ మాట్లాడుతూ దళితుల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల ప్రసన్నలక్ష్మి, బెల్లాన శ్రీనివాస్, పోతల శ్రీను, బండి పెద్ద అప్పలరాజు, సబ్బవరపు చందు, గాలి రాజు, కటారి నూకరాజు, మాదల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కె.కోటపాడు చౌడువాడ గ్రామంలో భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్, ఆర్డీవోకు ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భీంపల్లి రాము, కెల్లి సూరిబాబు మాట్లాడుతూ చౌడువాడ సర్వే నెంబర్ 421/1గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తెలిపారు. 2007లో ఇదే భూమి కబ్జాకు గురైతే అప్పుడు గ్రామస్తులు తహశీల్దారుకు ఫిర్యాదు చేయడంతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకూ కబ్జాదారులు దాని జోలికి పోలేదని, తిరిగి ఈ నెల 10న మళ్ళీ ఆ స్థలాన్ని మరలా కబ్జా చేసి అక్రమకట్టాడాలు చేసి తప్పుడు డ్యాకుమెంట్స్ తయారు చేశారని తెలిపారు. అడిగిన వారిపై దాడులు చేయడం, చంపేస్తామని బెదిరింపులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అక్రమ కట్టడాలు నిలుపుదల చేసి ప్రభుత్వం భూమిని కాపాడాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఆర్‌డివో అధికారులు మాట్లాడుతూ కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తప్పుల తడకగా ఎస్‌సి కుల గణన సర్వే

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీల జనాభా వివరాలపై ప్రభుత్వం సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎస్సీల కులగణన వివరాలు రెవిన్యూ అధికారులు తప్పుడుగా నమోదు చేసి చూపిస్తున్నారని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షులు బోని గణేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మైలపల్లి పోతురాజు, బోని రాంబాబు, తట్టా రాజు, బండి అప్పారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి :కాకినాడలో 2025 జనవరి 5 నుంచి 8 వరకు జరుగు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను ఆదివారం సాయంత్రం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిషోర్ కుమార్, ఎస్.మురళి మోహన్‌రావు, రెడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 26 31వ తేదీ వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు గొంది చిన్నబ్బాయి, వత్సవాయి శ్రీలక్ష్మి, పి.వెంకట్రావు, నాయకులు రొంగలి అక్కునాయుడు, జిఎస్.ప్రకాష్, శేషుబాబు, ఎల్లయ్య బాబు, ఎంవి.అప్పారావు, నాతవరపు సతీష్, జెకెఆర్ స్వామి, అలివేలు, సలీం, రవి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, రాజ్యాంగంపై బిజెపికి చిత్తశుద్ధి లేదు

ప్రజాశక్తి -అనకాపల్లి

రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై గానీ, ఆయన రచించిన రాజ్యాంగంపై గాని బిజెపికి, ఆ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి లేదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను బలంగా తీసుకెళ్లడమే కాకుండా రాజ్యాంగాన్ని హక్కులను కాలస్తుందని తెలిపారు. రాజ్యాంగం రచించిన అంబేద్కర్‌పైన పార్లమెంటులోనే అగౌరవ పరుస్తూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడడం బాధాకరన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజన్న దొరబాబు, మాకిరెడ్డి రామానాయుడు, అప్పలరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 206 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 206 అర్జీలు అందాయి. వాటిని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వైఎస్‌వికెజిఎస్ఎల్ సత్యనారాయణరావు స్వీకరించారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం అనకాపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం బాలాజీ, ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులు యువకులు మత్తుమాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రానున్న నూతన సంవత్సరం ఇంటి వద్దనే సాంప్రదాయబద్ధంగా కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సూచించారు. బయటకు వచ్చి అసంఘటిత కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబం, బంధుమిత్రులు తీవ్ర శోభకు గురవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి గౌతమ్, ఎం.వినయ్, నూకరాజు, విజయ్ కృపా ఆనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రీయ పద్ధతితో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి-అనకాపల్లి : సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యకరమైన పంటలను ప్రజలకు అందించడమే ధ్యేయంగా ప్రకృతి వ్యవసాయ శాఖ పనిచేస్తుందని అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు అధికారి సిహెచ్ లచ్చన్న తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను స్టాల్ ద్వారా ప్రజలకు తక్కువ ధరకే అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్స్ శిరసపల్లి అప్పలరాజు, పోతల శివ, మోడల్ మేకర్ వెల్లూరు శ్రీనివాసరావు, మువ్వల గురువు నాయుడు, ఐసిఆర్ పి స్వాతి, సత్య న్యాచురల్ ఫామింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న వరికి ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

తుపాను కారణంగా వర్షాలకు దెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు రూ.30వేలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఏపి రైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ జిల్లాలోని మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, బుచ్చయ్యపేట, చోడవరం మండలాల్లో అనేక గ్రామాల్లో వరి పంట మూడు తుపానుల వల్ల కుళ్లిపోయి పనికిరాకుండా పోయిందని, మిగిలిన పంట కూడా రంగు మారే పరిస్థితి ఉందని తెలిపారు. పాడైపోయిన పంటకి ఎకరాకి రూ.30 వేలు ఇవ్వాలని, ఎన్టీఆర్ రైతు భరోసా రూ.20 వేలు చెల్లించాలని కోరారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న క్వింటాకు రూ.2,300కి అదనంగా రూ.500 కలిపి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ నష్టపోయిన పంటను పరిశీలించామని, ధాన్యం కొనుగోలు చేయాలని, అగ్రికల్చర్ జెడికి, సివిల్ సప్లై అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే రామ సదాశివరావు, అధ్యక్షులు ఎస్ బ్రహ్మాజీ, రైతు నాయకులు బుద్ధ రంగారావు, రాము పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు నాయకులు

పునరావాసం, ప్యాకేజీ కల్పించాలి

- తహశీల్దారుకు కృష్ణంపాలెం ఎస్ఇజెడ్ నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలో కృష్ణంపాలెం ఎస్ఇజెడ్ నిర్వాసితులకు ప్రభుత్వం పునరావాస కాలనీ నిర్మించి, మెరుగైన ప్యాకేజీ అందించి ఆదుకోవాలని, సర్వేల పేరుతో కాలయాపన చేయొద్దని ఆ గ్రామస్తులు సోమవారం తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు సత్తిబాబు, శంకర్రావు మాట్లాడుతూ తమ భూములు, ఇళ్లు తీసుకొని 17 సంవత్సరాలైనా నేటికీ పునరావాసం కల్పించలేదని, ప్యాకేజీ అందించలేదని, ఉపాధి కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఉన్నతాధికారులు సర్వే చేసి, లిస్టులు పూర్తి చేశారని, మళ్లీ అధికారులు సర్వేల పేరుతో నిర్వాసితులను మోసం దారుణమన్నారు. అప్పటి సర్వేలో ఎవరైనా మిగులు ఉంటే వారిని చేర్చి, తమకు ఇవ్వవలసిన ప్యాకేజీ, పునరావాస కాలనీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌ల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన రెండో రోజు సోమవారం మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మ్యాప్ పాయింట్ బుక్స్, జామెట్రీ బాక్సులు, ప్లాంకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, కూండ్రపు రామునాయుడు, వేగి గోపికృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, కాయల మురళీధర్, ఉల్లింగల రమేష్ ఎంపీటీసీ షేక్ దర్గా, మాజీ సర్పంచులు బుదిరెడ్డి గంగయ్య, మజ్జి ప్రకాష్ రావు, బుద్ద శ్రీను, జెర్రిపోతుల నూకు నాయడు, ఆండ్రా ప్రసాద్, దాడి నాగరాజు, మల్ల సూర్యారావు, బద్దపు గోపి, మందపల్లి చిరంజీవి, కోటూర్ సంతోష్, నరసింహనాయుడు, సిదిరెడ్డి సూర్యనారాయణ, కర్రి గోవింద, బలిజి ముసిలి నాయుడు, కలగా గోవిందా, దొడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు

గొబ్బురులో మేలుకొలుపు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని గొబ్బురు గ్రామంలో సోమవారం తెల్లవారు జామున మేలు కొలుపు కార్యక్రమం నిర్వహించారు. పాటలు, భజనతో వీధుల్లో తిరిగారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుద్ద నాగమణి, కూటమి నాయకులు మళ్ల బాబు, మళ్ల సూర్యారావు, పప్పల బుజ్జి, బుద్ద శ్రీను, నీటి సంఘం ఛైర్మన్ రమణ, మళ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి కింద విడుదలైన చెక్కులను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. దేవరాపల్లి మండలం తారువ గ్రామానికి చెందిన కైచర్ల సింహాచలం నాయుడుకు రూ.1,69,647 చెక్కును, ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కర్రి అప్పలనర్సకు రూ.40,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శెరకాన సూర్యనారాయణ, రైవాడ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, పెద్దాడ వెంకటరమణ, అల్లు శ్రీను, రెడ్డి అశోక్ పాల్గొన్నారు.


యోగా పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : ఈ నెల 24న విశాఖలో యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యోగా పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ముత్యాలు దివ్యజ్ఞ మొదటి స్థానం సాధించింది. ఈ మేరకు దివ్యజ్ఞను సోమవారం పాఠశాలలో స్కూల్ అకడమిక్ ఇన్‌చార్జ్ చంద్రమౌళి, అధ్యాపక బృందం అభినందించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విశాఖ స్టీల్‌సిటీ లైన్స్ క్లబ్ వారు సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పికెయం.లక్ష్మి, సెక్రెటరీ బి.సత్యప్రకాష్, ట్రెజరర్ ఆర్.రామచంద్రరావు, పాఠశాల హెచ్ఎం ఆర్.సుజాత, లైన్స్‌క్లబ్ మెంబర్ ఎమ్ .జగన్నాథరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి



మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-పరవాడ

భూములు ధరలు పెరగడంతో ఆక్రమణలు పెరిగాయని, మండలంలలో గెడ్డలు, చెరువులు, బంజరు వంటి ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆక్రమణదారులు ఎంత పెద్ద వారైనా, ఏ రాజకీయ పార్టీలకు చెందిన వారైనా ఉపేక్షించవద్దని సూచించారు. పరవాడ సంతబయలు వద్ద సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిరిపురం అప్పలనాయుడు, తహసిల్దార్ ఎస్వి అంబేద్కర్, ఎంపీడీవో శ్యామ్ కుమార్, కూటమి నాయకులు బోడ్డపు శ్రీనివాసరావు, పైల జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, కన్నూరు వెంకటరమణ, మోటూరు సన్యాసినాయుడు, చింతకాయల ముత్యాలు పాల్గొన్నారు.

మండలంలోని వెన్నెలపాలెం జరిగిన సదస్సులో ఆ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.

మునగపాక : సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని తోటాడ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్వే డీటీ పడాల్, సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మీ, నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దొడ్డి రమేష్, వెంకటేష్, సచివాలయ సెక్రటరీ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఏపి రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రజల నుంచి భూసంబంధిత సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ రమేష్, మాజీ ఎంపీటీసీ ప్రసాద్, కనకరాజు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరు గాంధీ సెంటర్ గ్రౌండ్ వద్ద జివిఎంసి 17, 18, 19, 20, 21, 22 వార్డులకు సంబంధించి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు శివ ప్రసాద్, మట్టి రమేష్, త్రినాధ్, ప్రేమలత, టిడిపి నాయకులు చోడే వెంకట పట్టాభిరాం, కార్పొరేటర్లు మూర్తి యాదవ్, గొలగాని మంగవేణి, నొల్లి నూకరత్నం పాల్గొన్నారు.

రాత్రి 12 తరువాత వేడుకలకు అనుమతి లేదు

ప్రజాశక్తి-చోడవరం : నూతన సంవత్సర వేడుకలకు రాత్రి 12 గంటలు దాటిన తర్వాత అనుమతి లేదని చోడవరం సీఐ పీ అప్పలరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న దాబాలు, రెస్టారెంట్లల్లో ఎటువంటి మద్యం సేవించడానికి అనుమతి లేదన్నారు. 31 తేది రాత్రి 12గంటల తరువాత ఆకతాయిలు బైక్ సైలెన్సర్లు తీసి అధిక ధ్వని చేసినా, తాగి బైకులు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అశ్లీల దాన్సులు, అహింస కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-మునగపాక : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండల పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వేడుకలలో భాగంగా అశ్లీల నృత్యాలు, డీజేలు పెట్టడం, మత్తు పానీయాలు సేవించడం చేయరాదన్నారు. బైక్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఎంఇఒ అభినందనలు

ప్రజాశక్తి-యలమంచిలి : సైన్స్‌పట్ల ఆసక్తి కనపరుస్తున్న జంపపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులను సోమవారం ఎంఇఒ మీనాక్షి అభినందించారు. ఇటీవల యలమంచిలి కొత్తపేట హైస్కూల్లో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో రైన్ హార్వెస్టింగ్, ట్రాఫిక్ సేఫ్టీ రూల్స్, ఆటోమేటిక్ వాటర్ ఇన్ ది ఫీల్డ్స్ ఈ మూడు ప్రాజెక్టులు విద్యార్థులు రూపొందించారు. సోమవారం హైస్కూలను సందర్శించిన ఎంఇఒ ఈ ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులు బి.రేణు (8వ తరగతి), ఎస్.తారకేష్ (9వ తరగతి), బి.వెంకటేష్ (10 తరగతి)లను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎవిహెచ్ శాస్త్రి, ఉపాధ్యాయులు కెఆర్ఎ నాయుడు, కె.చిట్టిరాజులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 2008 నుండి నేషనల్ హెల్త్ మిషన్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్నారని, వీరికి ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రామకృష్ణ, అధ్యక్షులు పెంటకోట జయరాజు, ఆఫీస్ బేరర్ పెంటయ్య, డాక్టర్ రామలక్ష్మి, వి సూరి అప్పారావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులతో పాటు అధికార్లు తప్పక హాజరు కావాలని కోరారు. అయితే మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి వైసీపీని వీడి బిజెపిలో చేరడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. మెజార్టీ కౌన్సిల్ సభ్యులు వైసీపీకి చెందిన వారు కావడంతో సమావేశం రసవత్తరంగా సాగే అవకాశం ఉందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు.

చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల తహశీల్దారు పి.లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని వాకపల్లి ఎస్సీ కాలనీలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవరాపల్లి బీసీ హాస్టల్ వార్డెన్ దాసరి రమేష్ అధ్యక్షతన సోమవారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంచ జరిగింది. ఇందులో పాల్గొన్న తహశీల్దారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ఎవరు చేయకూడదని హితవుపలికారు. ఆడపిల్లలను చక్కగా ఉన్నత చదువులు చదివించి వివాహ వయస్సు వచ్చాక మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. అనంతరం స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కెవి.రమణ, కె.కోటపాడు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ గంగునాయుడు, జనసేన నాయకుడు గుమ్మడి శ్రీరామ్, కాలనీవాసులు సానబత్తు సూర్యనారాయణ, తాటపల్లి రాజు, తెలుగట్ల చిన్న, ఎర్రబల్లి లీలావతితదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ప్రభుత్వాలు సామాజిక న్యాయం కోసం అనేక చట్టాలను తీసుకువచ్చాయని మండల తహసిల్దార్ ఎం లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్ద మదిన దళితవాడలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి తమ హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

రోడ్లు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో అవసరమైన చోట్ల రోడ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి ఆ గ్రామ తెలుగుదేశం నాయకులు సోమవారం విన్నవించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు తంగేటి ముత్యాలు, టిడిపి నాయకులు చుక్క ఈశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు, గంటా రమణ, చుక్క పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన



నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- మాడుగుల:విద్యుత్ చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహామూర్తి ఆధ్వర్యంలో సోమవారం మాడుగుల బస్ కాంప్లెక్స్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.9,412 కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. సూపర్ సిక్స్,హామిలుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ప్రజలను విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై బారాలు వేయడం సిగ్గు చేటన్నారు. నూనె, పప్పులు, కంది పప్పుతో పాటు అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర మాత్రం పెరగ లేదన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపును వేగవంతం చేసిందని, వీటిని అదాని కంపెనీకి అప్పగించిందని తెలిపారు.రానున్న రోజుల్లో మీటర్ల ఖరీదును బిల్లుతో వాయిదా పద్ధతిలో కట్ట వలసిన ఉంటుందని అన్నారు. విద్యుత్ చార్జీలు పెరగడంతో విద్యుత్ పై తయారు అయ్యే ప్రతి వస్తువు ధరలు పెరుగు తాయని, దీంతో ప్రజలపై మరింత భారాలు పడతాయని పేర్కొన్నారు. వెంటనే కరెంట్ చార్జీల పెంపును ఉప సంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకురాలు కె భవాని, పాలకొండ,అయ్యప్ప, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:అంతపురం జిల్లాలో న్యాయవాది వివి శేషాద్రి పోలీస్ స్టేషన్లో మృతి చెందడంపై పోలీసులపై చర్యలు తీసుకోవాలని స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు సముదాయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది మెట్ట ప్రభాకర్ మాట్లాడుతూ, శేషాద్రి మృతికి కారకులైన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిపై అప్రజాస్వామికంగా పోలీసులు ప్రవర్తించి వేధింపులకు గురి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ అనిమిరెడ్డి శివకృష్ణ, కె ఆర్ వి సత్యనారాయణ, చింతల ప్రకాష్, కామిరెడ్డి సత్యనారాయణ, వాసవి దత్త, జీవీ మంగ, మృదుల తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సివిల్ జడ్జ్

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక సబ్ జైల్ ను సీనియర్ సివిల్ జడ్జ్ పి సయాజ్ ఖాన్ సోమవారం సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సబ్ జైల్లో ఖైదీలతో మాట్లాడారు. ఏ పరిస్థితుల్లో జైలుకు వచ్చారని వారిని నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రవర్తనలో పరివర్తన రావాలని, చేసిన తప్పులను తిరిగి మరల చేయకుండా ఉండాలన్నారు. ఈ . కార్యక్రమంలో సివిల్ జడ్జ్ మధుసూదన్ రావు, అడిషనల్ సివిల్ జడ్జ్ ఎం రోహిత్, గోవర్ధనగిరి పాల్గొన్నారు.

ఎంఆర్పిఎస్ నేతల నిరసన

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎస్సీ కుల గణన జాబితాలో లోపాలను సరి చేయాలంటూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు అనంతరం తహసిల్దారు తిరుమల బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాలా గ్రామాల్లో మాదిగ కులస్తులను మాల కులస్తులుగా, మాల కులస్తులను మాదిగ కులస్తులుగా నమోదు చేయడం, కుల జాబితాను విడుదల చేయడంలో అధికారుల నిర్లక్ష్యం, క్రైస్తవులుగా బీసీలుగా ఉన్నవారిని ఎస్సీ కులంలో చేర్చడం, మరణించిన వారి పేర్లు జాబితాలో నమోదు చేయడం వంటి తప్పులను సవరించి తుది జాబితా విడుదల చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గంట్యాడ లోవరాజు, కోటవుట్ల ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పెదపూడి శ్రీను, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణ, వేణు, నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బీసీ హాస్టల్ వద్ద డివిజన్ కార్యదర్శి జనార్దన్ ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గౌతం మాట్లాడుతూ, ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్, ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలు, హాస్టల్ విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వం నుంచి రావలసిన ప్రతి ఒక్క పథకాన్ని విద్యార్థులకు చేరేలా ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. సోషల్ యాక్టివిటీస్లో కూడా ఎస్ఎఫ్ఐ ముందుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు జనార్దన్, విజయ్, డివిజన్ ప్రెసిడెంట్ భూషణ్, డివిజన్ సభ్యులు రవి, భార్గవ్, ప్రవీణ్,గణేష్, వరహాలబాబు, ప్రవీణ్, సత్యనారాయణ, మహీ, దుర్గ, సాయి పాల్గొన్నారు..

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల: నూ ఇయర్ వేడుకల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని స్థానిక ఎస్సై రమేష్ సూచించారు. గ్రామాలలో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, మితిమీరి వాహనాలు నడపడం, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు, రాత్రి 12 గంటలు దాటిన తర్వాత ప్రధాన రహదారిపై తిరగడానికి అనుమతి లేదని తెలిపారు, నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

గొలుగొండ:నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎవరైనా హద్దు మీరితే చర్యలు తప్పవని గొలుగొండ ఎస్సై పి.రామారావు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అర్ధరాత్రి రోడ్ల మీద వేడుకలకు ఎటువంటి అనుమతి లేదన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, గుంపులుగా రోడ్లపైకి చేరినా, కేకలు వేస్తూ రోడ్లపై తిరిగినా చర్యలు ఉంటాయన్నారు. ప్రజా శాంతి భద్రతల రక్షణ కోసం ఆ రోజు అంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు.

ఉపమాకలో వైభవంగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల భాగంగా సోమవారం గరుడ వాహనంపై వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాల చార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను గరుడ వాహనం పైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకిలోను వేయింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


నిరసన చేపడుతున్న నాయకులు

జనసేన నేతల నిరసన

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :మున్సిపాలిటీలో వీధిలైట్లు రాత్రిపూట కాకుండా పగటి పూట వెలగడంతో కరెంటు చార్జ్ వృధా అవుతుందని, తక్షణమే చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పెద్ద బొడ్డేపల్లి లో ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ముందు సోమవారం నిరసన తెలియజేశారు. ఇఇ రామకృష్ణారావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో రాత్రిపూట వెలగడమే కాకుండా పగటిపూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయని, ఈ సమస్యపై మున్సిపాలిటీ, విద్యుత్ అధికారులకు తెలిపినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ఈ సమస్యపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ విధంగా వెలగడంతో మునిసిపాలిటీకి నెలకు 35 వేల నుండి 40 వేలు వృధాగా ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరపాత్రుడు, మారిశెట్టి రాజా, బైన మురళి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


నక్కపల్లిలో ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఎంఈఓ లు నరేష్, వేమగిరి నూకరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ చంద్రరావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, తోట సత్తిబాబు, బాబ్జి తదితరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన 30 వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డిఎల్ పురం, చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసాద్, కళ్యాణి, సుందర రావు, వెంకటరమణ, మణికుమార్, అప్పారావు, సి ఆర్ పి లు శేఖర్, అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, సూక్ష్మ దృష్టితో విషయాలు తెలుసుకొని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంపీపీ జగన్మోహన్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వ్యక్తిగత విభాగం, గ్రూపు విభాగం, ఉపాధ్యాయ విభాగం అని మూడు తరగతులుగా విభజించి అందులో విజేతలకు బహుమతులను తెలుగుదేశం సీనియర్ నాయకులు డోకల లక్ష్మీనరసింహమూర్తి అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన గ్రీన్ హౌస్ మానిటరింగ్ సిస్టంకు వ్యక్తిగత విభాగంలోనూ, ఏ కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ విభాగంలోను, ఉపాధ్యాయ విభాగంలో ఏ కోడూరు హైస్కూల్ కు చెందిన ఉపాధ్యాయుడు రమేష్కు బహుమతులు లభించాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు డోకల నరసింహమూర్తి, హెచ్ఎం ఎస్వీ పద్మావతి, ఎంఇఒ-2 డివిడి ప్రసాదు, నోడల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, సైన్స్ ఉపాధ్యాయులు ఎర్రి నాయుడు, కామేశ్వరరావు, నారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఎంఈఓ రామారావు ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు, విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. మూడు విభాగాలుగా ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, ఎంఈఓ 2 జోష్, పాఠశాల హెచ్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కోటవురట్లలో ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

గ్రామ కంఠం స్థలాలు సర్వే

ప్రజాశక్తి-చీడికాడ:చీడికాడ గ్రామంలో గత కొంతకాలంగా రోడ్డు కిరివైపులా గ్రామకంఠం స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా గ్రామపంచాయతీ, రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టలేదని బిజెపి నాయకులు రెడ్డి కొండబాబు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం చీడికాడలో మెయిన్ రోడ్డుకి ఇరువైపులా గ్రామకంఠం స్థలాలపై మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గ్రామ కంఠం స్థలాలను గుర్తించి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామనిపంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు తెలిపారు. గ్రామకంఠ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఓ

పశువుల షెడ్లను త్వరగా నిర్మించాలి

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గోకులం పశువుల షెడ్లు సుమారు 96 షెడ్లకు గాను రెండు కోట్ల ఐదువేల రూపాయలు మంజూరు చేయగా ఇందులో ప్రస్తుతం 26 పంచాయతీల్లో పశువుల షెడ్ల నిర్మించటం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని జెవి పాలెం, పెట్టుగోడపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ, జనవరి 10వ తేదీ నాటికి అన్ని షెడ్లు కూడా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించి గోకుల షెడ్లు మొదటి విడత నిర్మాణం పూర్తి చేసుకున్నట్లయితే మరల రెండో విడత నిర్మాణమునకు కుడా ప్రతిపాదనలు చేసుకోవచ్చునన్నారు. లబ్ధిదారు లందరూ జనవరి 10వ తేదీ లోపల నిర్మాణాలు పూర్తి చేయాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు మంచాల స్కూల్ ఎంపిక

ప్రజాశక్తి -చీడికాడ:న్యూఢిల్లీలో జనవరి 8 నుంచి ఎన్ఐఈపిఏ, ఎన్సిఈఆర్టి ఆధ్వర్యంలో జరిగే జాతీయ సదస్సుకి ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపిక అయినట్లు మంచాల ఆదర్శ పాఠశాల, కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. విద్యార్థులకు విద్యా బోధనలో స్కూలు సిబ్బంది అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను, పద్ధతులను వీడియో రూపంలో డాక్యుమెంటరీగా తయారు చేసి ఎన్సీఈఆర్టీకి పంపామన్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్ తరపున ఆదర్శ పాఠశాల కాలేజీ తరపున జాతీయ సదస్సుకి ఎంపికైనట్లు ఆమె తెలుపుతూ ఆనందాన్ని విలేకరులతో పంచుకున్నారు. రాష్ట్రంలో ఈ పాఠశాలకి ఇంత గుర్తింపు రావడానికి తమ సిబ్బంది అవలంబిస్తున్న విద్యాబోధనలో నూతన విధానాలు అని అభినందించారు.

పలు రకాల స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్డిఓ కార్యాలయం ప్రాంగణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో సోమవారం అర్బన్ మార్కెట్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ డ్వాక్రా గ్రూపుల ద్వారా ఏర్పాటు చేసి గృహోపకరణ వస్తువులు, బట్టలు, నిత్యవసర సరుకులు అమ్మకాలు చేపట్టారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఆఫీసర్ రమ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు రుణాల అందించి సభ్యుల ద్వారా వ్యాపారాల కొనసాగిస్తున్నామన్నారు. సభ్యుల అభివృద్ధే తమ ధ్యేయమని తెలిపారు.

సిపిఎం నాయకుని గృహ నిర్బంధంపై నిరసనలు

ప్రజాశక్తి-అనకాపల్లి:నక్కపల్లి మండలంలో ప్రభుత్వం తలపెట్టిన బల్క్ డ్రగ్స్ కోసం రైతుల భూముల్లో చెట్లు, తుప్పలు తొలగించే కార్యక్రమం నేపథ్యంలో ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పోలీసులు సోమవారం ఉదయం నుండి గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ అనకాపల్లి ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వాలు ఏ కార్యక్రమాలు చేపట్టినా ముందుగా ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం నాయకులను అక్రమంగా నిర్భందించడం సరికాదన్నారు. అధికారంలోకి రాకముందు అరెస్టులు, నిర్భందాలు అప్రజాస్వామికమని నినదించిన రాష్ట్ర హోం మంత్రి అనిత నేడు సిపిఎం నాయకులపై నిర్భందాలు ప్రయోగించడం అప్రజాస్వామికం కాదా? అని ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో ప్రజా సమస్యలు, భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా నిర్వాసితులు, ప్రజలు చెప్పిన సమస్యలను వినకుండా దాటవేస్తూ బల్క్ డ్రగ్స్ కోసం భూసేకరణ పనులు చేపట్టడం అన్యాయన్నారు. సిపిఎం



నక్కపల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న లోకనాథం, కోటేశ్వరరావు, నాయకులు

జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల సాగు భూములకు పరిహారం చెల్లించాలని, ఇళ్లు కోల్పోతున్న వారికి, భూములపై ఆధారపడి జీవిస్తున్న కూలీలు, వృత్తిదారులకు ఎంత ప్యాకేజీ ఇస్తారు? ఎప్పటిలోగా ఇస్తారనేది స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఏ విధంగా పనులు చేపడతారని? గృహ నిర్బంధాలు ద్వారా పోలీసులను మోహరించి ఎంత కాలం పనులు చేస్తారని ప్రశ్నించారు. ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యన్నారాయణ, గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు బి.ప్రభావతి, అడిగర్ల రాజు, డిడి.వరలక్ష్మి, బి.ఉమామహేశ్వరావు, నాయకులు జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, ఎల్.గౌరి, మాణిక్యం, సుభాషిణి, పి.చలపతి తతదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రజల కోసం పోరాటాలు చేస్తున్న వారిని గృహ నిర్బంధం చేయడం దారుణమని సిపిఎం నాయకులు ఎం.సత్యనారాయణ, మనబాల రాజేష్ అన్నారు. వైజాగ్ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో చేపట్టిన పనులను అడ్డుకుంటారని భావించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. రాజయ్యపేటలో స్థానిక మత్స్యకారులతో కలిసి నిరసన తెలిపారు. తమ ప్రాంతంలో బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు చేసి మత్స్యకారుల పొట్టకొట్టొద్దన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు తగ్గిస్తే పోరాటం

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల నుండి నుండి 60 సంవత్సరాలకు తగ్గించడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని, కనుక యధావిధిగా 62 సంవత్సరాలు కంటిన్యూ చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి. నూకరాజు, ప్రధాన కార్యదర్శి కురుకుటి రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌కు యూనియన్ తరపున వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,

రిటైర్మెంట్ వయసు 62 నుండి 60 సంవత్సరములకు తగ్గింపు సర్క్యులర్ వార్త పిడుగు పడినట్లుగా ఉందని కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికే పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ సిబ్బంది శాంక్షన్ పోస్టుల కంటే చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. ఒక్క పబ్లిక్ హెల్త్ లోనే పర్మినెంట్ ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు 7,452 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 6166 మంది మాత్రమే ఉన్నారన్నారు. అంటే 1,286 మంది తక్కువగా ఉన్నారని తెలిపారు. దీనికి తోడు 1,888 మంది పారిశుధ్య పనులకు కాకుండా సూపర్వైజర్లు గాను, వర్కర్ కం డ్రైవర్లుగా, లోడర్లుగా డ్రైవర్లు,



కమిషనర్‌కు సమస్యలు చెబుతున్న యూనియన్ నేతలు

క్లీనర్లుగా,వెటర్నరీ మలేరియా,ఎం పి హెచ్ విభాగాలలో పనిచేస్తున్నారని తెలిపారు.సిబ్బంది కొరతతో ఇప్పటికే పని భారం పెరిగిందన్నారు. ఇప్పటివరకు ఉన్న 62 సంవత్సరాల రిటైర్మెంట్ విధానాన్ని కొనసాగించాలన్నారు. లేకుంటే నీటి సరఫరాతో సహా పారిశుధ్య కార్మికులు, ఇతర విభాగాల కార్మికులు సమ్మెలోకి వెళ్లడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముద్దాడ ప్రసాద్, జె.ఆర్ నాయుడు, ఈ. ఆదినారాయణ, గొలగాని అప్పారావు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న ఐద్వా నాయకులు

మద్యం షాపు పెట్టొద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:జివిఎంసి జోన్ రెండు, 5 వ వార్డు మధురవాడ స్వయం కృషి నగర్ (శివశక్తి నగర్ రోడ్డు)లో మద్యం షాపు, బార్ ఏర్పాటు చేయవద్దని ఐద్వా మధురవాడ జోన్ కార్యదర్శి బి.భారతి నాయకత్వంలోని ప్రతినిధి వర్గం సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ, మద్యం షాపు ఏర్పాటు చేస్తున్న పక్కనే గర్ల్స్ హాస్టల్ ఉందన్నారు. దానికి పక్క వీధిలో చర్చి ఉందన్నారు. ఇది నివాస ప్రాంతమని, ఇక్కడ మహిళలు పిల్లలు నిత్యం తిరుగుతుంటారని ఇటువంటి ప్రాంతంలో మద్యం బార్ షాప్ ఏర్పాటు చేయవద్దని కోరారు.ఈ సమస్యపై జోన్ రెండు కార్యాలయం ఎదుట రెండు పర్యాయాలు నిరసన తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండమ్మ, గ్రామ సేవా సంఘం కార్యదర్శి కె.మణి, టి.కె.శారద, ఆనందరావు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమం

-సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు-పార్టీ జిల్లా మహాసభ తీర్మానాలు వెల్లడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమించనున్నట్టు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తెలిపారు. నగరంలో అత్యంత కీలకమైన సమస్య, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, పేదల పట్టాల రిజిస్ట్రేషన్ అని తెలిపారు. వీటి సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పేదలను, ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలని రెండు రోజులు పాటు పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో జరిగిన తమ పార్టీ జిల్లా మహాసభ తీర్మానించిందని చెప్పారు. సోమవారం జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్,



మాట్లాడుతున్న జగ్గునాయుడు

వి.కృష్ణారావులతో కలిసి ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా మహాసభ చేసిన తీర్మానాలను వివరించారు. మహాసభల్లో 35 తీర్మానాలను ఆమోదించి నట్లు చెప్పారు. మహాసభలు అత్యంత జయప్రదంగా జరిగాయని, ఈ మహాసభల్లో కార్మిక, రైతు, మహిళ, యువజన, విద్యార్థి, వివిధ తరగతుల ప్రజా సమస్యలను పరిష్కరించాలని 35 తీర్మానాలు చేసి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. సింహాచలం పంచగ్రామాలు, ఇనాం భూసమస్యను పరిష్కరించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని తీర్మానించామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక యువతకు పరిశ్రమల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అంతవరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలపై హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సంస్థల్లో కొలువులు కల్పించాలని, జిల్లా గ్రంథాలయాన్ని తక్షణమే నిర్మించాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను, యూజర్ ఛార్జీలను రద్దుచేయాలని మహాసభలో తీర్మానాలు చేశామన్నారు. మెట్రో రైలుతో పాటు వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ పనులు ప్రారంభించాలని, ఇఎస్ఐ 500 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీ విశాఖలో నిర్మించాలని తీర్మానాలు చేశామన్నారు. వాటిపై ప్రజలను సమీకరించి భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు విద్యుత్ భారాలకు వ్యతిరేకంగానూ, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని ఉద్యమాన్ని కొనసాగించాలని మహాసభ కర్తవ్యంగా పిలుపునిచ్చిందన్నారు. 24 మందితో పార్టీ జిల్లా నూతన కమిటీ ఎన్నికైందన్నారు. ఆ వివరాలను వెల్లడించారు.